సాక్షి సూర్యాపేట

ఆదివారం । 17 । నవంబర్ । 2024



చీటీల పేరుతో మోసగించిన..

చీటీల పేరుతో మోసం చేసి పారిపోయేందుకు యత్నించిన భార్యాభర్తలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 585.30 అడుగులు
ఇన్‌ఫ్లో	: 18,482 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 18,482 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా : నిల్	
కుడికాల్వ ద్వారా	: 10,200 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 5,582 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 300

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం : 644.60 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 662.26 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: నిల్
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్




సాగర్‌లోనూ సీప్లేన్!

- ఇప్పటికే పరిశీలించిన కేంద్ర పౌరవిమానయాన శాఖ అధికారులు
- పర్యాటకుల్లో చిగురిస్తున్న ఆశలు

సండే స్పెషల్

నాగార్జునసాగర్ జలాశయం.. విహంగ వీక్షణానికి సీప్లేన్‌లు (నీళ్ల మీద దిగే విమానాలు) అందుబాటులోకి రానున్నాయి. నాగార్జునసాగర్-శ్రీశైలం-విజయవాడ-హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ మధ్య సీప్లేన్ నడిపేందుకు ఐదేళ్ల క్రితం పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ సర్వే నిర్వహించి ప్రణాళిక రూపొందించింది. ఈ మేరకు ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ (ప్రకాశం బ్యారేజీ)-శ్రీశైలం మధ్య సీప్లేన్ ట్రయల్ రన్ వేయడంతో త్వరలోనే నాగార్జునసాగర్ జలాశయంలోనూ సీప్లేన్‌లు తిరగనున్నట్లు తెలుస్తోంది.



నాగార్జునసాగర్: అంతర్జాతీయ పర్యాటక ప్రాంతమైన నాగార్జునసాగర్‌లో బౌద్ధం పరిఢవిల్లిన ప్రదేశం కావడంతో ఇక్కడికి సీప్లేన్‌లు నడిపితే ప్రపంచ దేశాల పర్యాటకుల రాకపోకలు పెరిగే అవకాశాలుంటాయని, పర్యాటక శాఖకు ఆదాయం కూడా పెరుగుతుందని హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన సమావేశంలో ఉన్నతాధికారుల మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. ఈ లోపే పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ట్రయల్ రన్ వేయడంతో తెలంగాణ ప్రాంతంలోని జలాశయాల మధ్య కూడా సీప్లేన్‌లు నడుపుతారని పర్యాటకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సీప్లేన్‌లను నడిపితే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.

ఇప్పటికే కేంద్ర బృందం పరిశీలన..

కేంద్ర ప్రభుత్వం విమాన సర్వీసులను పర్యాటకులకు మరింత చేరువ చేసేందుకు 'ఉడాన్' పథకం కింద ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా.. సీప్లేన్‌లు నాగార్జునసాగర్‌లో ఎక్కడ దిగాలి. ప్రయాణికులు ఎటు నుంచి ఎటు వెళ్లాలి అనే అంశాలపై కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం గతంలో పరిశీలించి వెళ్లింది. కెప్టెన్ ఇల్షాద్ అహ్మద్ నేతృత్వంలో బృందం నివేదిక తయారుచేసి కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. సాగర్ జలాశయం.. పోర్టుకు అనువుగా ఉన్నట్లు గుర్తించారు. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్‌లో రిజర్వాయర్ కనెక్టింగ్ సర్వీస్ 9, 12, 20 సీట్ల సామర్థ్యం కలిగిన విమాన సర్వీసులను నడిపేందుకు అనువైన ప్రాంతాలుగా గుర్తించారు. ఇదే సమయంలో సర్వే జరిగిన గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో సీప్లేన్‌లు ప్రారంభించి విజయవంతంగా సేవలను అందిస్తున్నారు. అదే తీరుగా నాగార్జునసాగర్-శ్రీశైలం-విజయవాడ ప్రాంతాలకు సీప్లేన్ సేవలను అందించడంతోపాటు విశాఖపట్టణానికి అనుసంధానం చేసేలా అప్పట్లో పౌరవిమానయాన శాఖ సూత్రప్రాయంగా అంగీకరించింది.

న్యూస్‌రీల్

రేపు, ఎల్లుండి సూర్యాపేట మార్కెట్‌కు సెలవు

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో పనిచేస్తున్న కార్మికుల రేట్ల పెంపు విషయంలో జరుగుతున్న చర్చలు కొలిక్కి రాకపోవడంతో రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈనెల 18, 19 తేదీల్లో యార్డుకు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి సంతోష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ రెండు రోజులు మార్కెట్ యార్డ్‌కు సరుకులు తీసుకురావద్దని కోరారు.


ఖైదీలు నేరప్రవృత్తిని వీడాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

చివ్వెంల(సూర్యాపేట): ఖైదీలు నేరప్రవృత్తిని వీడి సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూర్యాపేట జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి. శ్రీవాణి సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. గోవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సబ్‌జైల్‌ను సైకియాటిస్ట్ డాక్టర్ స్రవంతితో కలిసి సందర్శించారు. ఖైదీలను మెనూ వివరాలు అడిగి తెలుసుకొని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పు వల్ల ఖైదీలు జైలు జీవితం గడుపుతూ కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాల్సి వస్తోందన్నారు. డాక్టర్ స్రవంతి ఖైదీలతో మాట్లాడి వారి మానసిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ సుధాకర్‌రెడ్డి, డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు వసంత సత్యనారాయణ పిళ్లె యాదవ్, బొల్లెద్దు వెంకటరత్నం, మట్టిపల్లి ప్రవీణ్‌కుమార్, పెండెం వాణి, సూపరింటెండెంట్ పద్మజ, న్యాయవాదులు హసేన్, జిలకర చంద్రమౌళి, రంజిత్‌కుమార్, వీరప్రసాద్, కట్ట సుధాకర్ పాల్గొన్నారు.

ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలి



ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద తేమ శాతం పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట : రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ నిర్వాహకులను ఆదేశించారు. శనివారం సూర్యాపేట మండలం గాంధీనగర్ శివారులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, తేమను కొలిచే యంత్రాలను పరిశీలించారు. రైతులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతులకు ప్రభుత్వ మద్దతు ధర లభించేలా అధికారులు సహకరించాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఇతరుల మాటలు నమ్మి రైతులు ఆందోళనకు గురికావొద్దని సూచించారు. ఆయన వెంట స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, సిబ్బంది ఉన్నారు.

19న దివ్యాంగులకు ఆటల పోటీలు

భానుపురి (సూర్యాపేట) : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 19న సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో క్యారమ్స్, చెస్, షాట్ పుట్, వీల్ చైర్ రేస్, రన్నింగ్ పోటీలు ఉంటాయని వివరించారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు హైదరాబాద్‌కు పంపనున్నట్లు పేర్కొన్నారు.

రాజకీయ ప్రాధాన్యమివ్వాలి

- బీసీలకు కులాల వారీగా రిజర్వేషన్ కల్పించాలి
- స్థానిక సంస్థల్లో ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలి
- చట్టసభల్లోనూ బీసీ రిజర్వేషన్ కావాలి
- బీసీ డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ భూసాని వెంకటేశ్వర్‌రావుకు బీసీ సంఘాల వినతి
- నల్లగొండ కలెక్టరేట్‌లో బీసీ రిజర్వేషన్ల గుర్తింపుపై బహిరంగ విచారణ

నల్లగొండ: స్థానిక సంస్థల్లో అమలవుతున్న బీసీ రిజర్వేషన్లు ఏబీసీడీ పద్ధతిన కులాల వారీగా కల్పించాలని ఎంబీసీ కులాల నాయకులు విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల గుర్తింపు అంశంపై శనివారం నల్లగొండ కలెక్టరేట్‌లో తెలంగాణ బీసీ డెడికేటెడ్ కమిషన్ బహిరంగ విచారణ నిర్వహించింది. ఈ సందర్భంగా బీసీ సంఘాలు నాయకులు, ప్రతినిధులు తమ అభిప్రాయాలను కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి భూసాని వెంకటేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. చైర్మన్‌కు పలు సమస్యలు వివరించారు.

ఎవరేమన్నారంటే..

- స్వాతంత్య్రం వచ్చిన నాటినుంచి చాలా బీసీ కులాలకు వార్డు మెంబర్ అయ్యే అవకాశం దక్కలేదని, కొందరు బీసీ సంఘాల నేతలు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.
- మాజీ ఎమ్మెల్యే నిమ్మల రాములు కోడలు, నందికొండ మున్సిపల్ కౌన్సిలర్ నిమ్మల ఇందిర మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల్లోనే కాదు చట్టసభల్లో కూడా రిజర్వేషన్ కల్పించాలని, అప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందని కమిషన్ దృష్టికి తెచ్చారు.
- వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కులాల్లోని జనాభా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని విశ్వబ్రాహ్మణ సంఘం నేత విశ్వనాథంతో పాటు పలువురు నాయకులు కమిషన్‌కు వినతి పత్రం సమర్పించారు.
- కులగణన సక్రమంగా నిర్వహించి ఏ కులం జనాభా ఎంత ఉందో డేటా సేకరించిన తర్వాత ఆ విధంగా రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీ రిజర్వేషన్లు గతంలో 34 శాతం ఉండగా 19 శాతం కుదించారని దీంతో నష్టపోతున్నారని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చక్రహరి రామరాజుతో పాటు పలువురు నాయకులు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు.
- నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు నేలపట్ల రమేష్‌లు మాట్లాడుతూ తమ వృత్తిలో వేరే కులాల వారు కూడా రావడంతో మాకు ఉపాధి సరిగ్గా లభించడంలేదని, రాజకీయంగా సరైన ప్రాతినిధ్యం లేదని, జనాభా దామాషా పద్ధతిన రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు.
- ఎంబీసీ కులాల జాతీయ అధ్యక్షుడు కొండూరు సత్యనారాయణ మాట్లాడుతూ ఎంబీసీ కులాలకు కూడా దామషా ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలని కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు.
- అన్ని బీసీ కులాలకు న్యాయం జరిగేలా అవకాశాలు కల్పించాలని, ముఖ్యంగా పూసల, వడ్డెర, ఇతర సంచార జాతుల వారికి ఇప్పటి వరకు రాజకీయంగా ఎలాంటి అవకాశం రాలేదని వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ముదిరాజ్ సంఘం నాయకులు కోరారు.
- బీసీ సంఘం నాయకులు దుడుకు లక్ష్మీనారాయణ, గంగాధర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజకీయ అవకాశం దక్కని కులాలకు నామినేటెడ్ పోస్టులు కూడా దక్కడం లేదని కమిషన్ దృష్టికి తెచ్చారు. బీసీ-ఏ నుంచి తమను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని మేదరి సంఘం నాయకులు కోరారు. వినతులు సమర్పించిన వారిలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, సమాచార హక్కు కమిటీ చైర్మన్ కేశవులు, వివిధ కుల, వృత్తి సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావుతో సమావేశమైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రభాకర్, చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇతర అధికారులు



కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొండూరు సత్యనారాయణ తదితరులు



బీసీ సంఘాల నేతలతో సమావేశమైన చైర్మన్ వెంకటేశ్వర్‌రావు

ధాన్యం విక్రయాల్లో దళారులను నమ్మొద్దు



నేరేడుచర్ల మండలంలోని చిల్లేపల్లి వద్ద ధాన్యం టోకెన్లు అందజేస్తున్న డీఏఓ, ఆర్డీఓ

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి

నేరేడుచర్ల : ధాన్యం విక్రయాల్లో దళారులను నమ్మవద్దని జిల్లా వ్యావసాయ శాఖ అధికారి జి. శ్రీధర్ రెడ్డి అన్నారు. నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులుతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి వద్ద రైతులకు ధాన్యం టోకెన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకవచ్చి మద్దతు ధరతో పాటు బోనస్ కూడా పొందాలన్నారు. కేంద్రాల వద్దకు వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా ప్రైవేటు వ్యక్తులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వస్తే వారిని నమ్మవద్దని, కేంద్రాల వద్ద ధాన్యం ఆరబోసుకునేందుకు అవకాశం ఇవ్వొద్దన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం తూకం వేసిన వెంటనే కేటాయించిన మిల్లులకు తరలించాలని, ధాన్యం ట్రాక్టర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా టోకెన్లు తక్షణమే ఇవ్వాలన్నారు. రైతులు మిల్లల వద్దకు వెళ్లి ఇబ్బందులు పడకుండా టోకెన్ల నంబర్ల ప్రకారం పోవాలన్నారు. చిల్లేపల్లిలో కొనసాగుతునన ఇంటింటి సమగ్ర సర్వేను పరిశీలించారు. సర్వే వేగవంతం చేయాలని, సర్వేలో పూర్తి వివరాలను సేకరించాలని, సర్వేపై ఎవరు కూడా అపోహలకు గురి కావద్దన్నారు. 75 అంశాలపై సమగ్రంగా వివరాలు తీసుకున్న తరువాతనే దరఖాస్తు ఫారాల్లో నింపాలని ఎన్యూమరేటర్లకు ఆర్డీఓ శ్రీనివాసులు సూచించారు. వారి వెంట నేరేడుచర్ల తహసీల్దార్ సురిగి సైదులు, ఏఓ జావిద్, జిల్లా సహకార సంఘం ఆడిటర్ నారాయణశర్మ, మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ నాగయ్య, నర్సింహారావు, కిరణ్, పాండునాయక్, సోమయ్య పాల్గొన్నారు.

విజయోత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు

భానుపురి (సూర్యాపేట) : ప్రజాపాలన విజయోత్సవాల కోసం ఘనంగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు కోరారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా పాలన విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం విజయోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మూడు టీములు పర్యటిస్తాయన్నారు. భాష, సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక ప్రదర్శనలు, సంగీత, నృత్య, పాటలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రచారం చేయడానికి కార్యాచరణ రూపొందించారని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ వి.అప్పారావు, డీఈఓ అశోక్, సీపీఓ ఎల్.కిషన్, డీటీడీఓ శంకర్, ఎస్సీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌నాయక్, డీపీఓ నారాయణరెడ్డి, డీడబ్ల్యూఓ నరసింహారావు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

నడిగూడెం : సమగ్రకుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ పర్స రాంబాబు సూచించారు. శనివారం నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. సర్వే చేస్తున్న తీరును అడిగి తెలుసుకొని వారికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట డీప్యూటీ తహసీల్దార్ హేమలత, ఆర్‌ఐ గోపాలకృష్ణ, సర్వే సిబ్బంది తదితరులు ఉన్నారు.



నడిగూడెంలో సర్వే సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

పాఠశాలల్లో లింగవివక్ష ఎలా ఉంది..

- ఆరా తీసిన వివిధ రాష్ట్రాల ఎన్జీఓ ప్రతినిధులు
- ఆత్మకూర్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో సమావేశం

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): 'పాఠశాలల్లో లింగవివక్ష ఎలా ఉంది. ఆడపిల్లలు, మగ పిల్లలు ఇంటి వద్ద, పాఠశాల వద్ద ఏఏ పనులు చేస్తున్నారు.. ఆడపిల్లలపై ఎలాంటి ఆంక్షలున్నాయి' అని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎన్జీఓ ప్రతినిధులు అడిగి తెలుసుకున్నారు. జార్ఖండ్ ,ఛత్తీస్‌గఢ్, వెస్ట్ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల ఎన్జీఓ ప్రతినిధులు శనివారం ఆత్మకూర్ మోడల్ స్కూల్‌లో లింగవివక్షపై సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో ఏ విధమైన సౌకర్యాలు లభిస్తున్నాయని, ఇంటి వద్దనే కాక పాఠశాలల్లో సైతం ఆడ,మగా అనే భేదం చూస్తున్నారా తదితర విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాస్, లలిత, నాయిని సైదులు, జయలలిత, భూతం యాకమల్లు, సత్యనారాయణ పాల్గొన్నారు.



సమావేశమైన ఎన్జీఓ ప్రతినిధులు

ఇసుక ట్యాక్సీ బుకింగ్‌లు మొదలు

అర్వపల్లి: మన ఇసుక-మన వాహనం పథకం ద్వారా జాజిరెడ్డిగూడెం మండలంలో ఇసుక ట్యాక్సీ బుకింగ్‌లు ఓపెన్ అయినట్లు తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక అవసరమైన వారు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలని సూచించారు. జాజిరెడ్డిగూడెం, నాగారం, తుంగతుర్తి, సూర్యాపేట మండలాల ప్రజలు ఇక్కడి నుంచి ఇసుకను తీసుకెళ్లడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. ట్రాక్టర్‌కు 1 నుంచి 10 కిలోమీటర్ల దూరం వరకు రూ.2,319, 11 నుంచి 15 కి.మీ వరకు రూ.2,444, 16 నుంచి 20 కి.మీ వరకు రూ.2,819, 21 నుంచి 25 కి.మీ వరకు రూ.3,194 చొప్పున ఖర్చు అవుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రూప్–3కి అంతా సిద్ధం

- నేడు పేపర్–1, పేపర్–2, రేపు పేపర్–3
- 50 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 16,543 మంది అభ్యర్థులు
- గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలంటున్న అధికారులు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

సూర్యాపేటటౌన్ : జిల్లాలో ఈనెల 17,18 తేదీల్లో నిర్వహించే టీజీపీఎస్సీ గ్రూప్ -3 పరీక్షలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్షల నిర్వహణపై ప్రత్యేకంగా నియమించిన రీజినల్ కోఆర్డినేటర్స్, స్ట్రాంగ్ రూమ్, జాయింట్ కస్టోడియన్స్, పోలీస్ నోడల్ ఆఫీసర్స్, చీఫ్ సూపరింటెండెంట్స్, డీఓ, ఫ్లయింగ్ స్క్వాడ్స్, జాయింట్ రూట్ ఆఫీసర్స్ తో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఇప్పటికే సమీక్ష సమావేశాలు నిర్వహించి పలు సూచనలు సైతం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. శనివారం పరీక్ష కేంద్రాల్లో హాల్‌టికెట్ నంబర్లు వేశారు.

సూర్యాపేటలో 30.. కోదాడలో 20 పరీక్ష కేంద్రాలు

గ్రూప్ -3 పరీక్షల నిర్వహణకు జిల్లాలో మొత్తం 50 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే వీటిలో సూర్యాపేటలో 30 పరీక్ష కేంద్రాలు, కోదాడలో 20 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 16,543 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు.



సూర్యాపేట పట్టణంలోని ఓ పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

పరీక్షలు ఇలా..

ఈనెల 17వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–1 (జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్) పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షకు సెంటర్ గేట్లు ఉదయం 9.30 గంటలకు మూసివేస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్ -2 హిస్టరీ, పొలిటికల్ అండ్ సొసైటీ పరీక్ష ఉంటుంది, దీనికి పరీక్ష కేంద్రం గేట్లు మధ్యాహ్నం 2.30 గంటలకు మూసివేస్తారు. ఈనెల 18వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–3 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షకు సెంటర్ గేట్లను 9.30 గంటలకు మూసివేస్తారు.

అరగంట ముందే గేట్లు మూసివేత

అభ్యర్థులు పరీక్ష కేంద్రాల వద్దకు గంట ముందే చేరుకోవాలి. అరగంట ముందే గేట్లు మూసివేస్తారు. నిర్దేశించిన సమయం తర్వాత అభ్యర్థులెవరినీ పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. పరీక్ష కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఏఎన్ఎం, మందులను అందుబాటులో ఉంచనున్నారు.

అభ్యర్థులకు సూచనలివే..

- పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతిలేదు.
- అభ్యర్థులు తమవెంట పరీక్ష హాల్ లోకి సెల్ ఫోన్లు, ట్యాబ్, పెన్ డ్రైవ్, బ్లూటూత్, ఎలక్ట్రానిక్ వాచ్, క్యాలికులేటర్లు, వ్యాలెట్ల వంటివి తీసుకెళ్లకూడదు.
- షూ కాకుండా చెప్పులు మాత్రమే ధరించి రావాలి.
- జ్యువెల్లరీ కూడా ఉండొద్దు.
- ప్రతి అభ్యర్థిహాజరును బయోమెట్రిక్ విధానంలో నమోదు చేయనుండగా నిర్ణీత సమయానికి గంట ముందే ఉండాలి.
- అభ్యర్థులు తమ వెంట బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్నులు, పెన్సిల్ , ఎరేజర్, లేటెస్ట్ ఫొటోతో కూడిన హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు తీసుకువెళ్లాలి.
- డౌన్‌లోడ్ చేసిన హాల్‌టికెట్‌పై ఫొటో సరిగా ముద్రించి లేకుంటే సదరు అభ్యర్థి గెజిటెడ్ అధికారి సంతకం తీసుకురావాలి.

ఏర్పాట్లు పూర్తి చేశాం

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



భానుపురి(సూర్యాపేట) : గ్రూప్ -3 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. పరీక్ష సెంటర్లలో విధులు నిర్వహించే అధికారులు ఉదయం 7 గంటల వరకు చేరుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణకు ఫ్లయింగ్‌స్క్వాడ్ 19, జాయింట్ రూట్ ఆఫీసర్స్ 10, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్ 54, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్స్ 208 మందిని నియమించినట్లు వివరించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు టీజీపీఎస్సీ నిబంధనలు పాటించాలని సూచించారు.


విధులు పకడ్బందీగా నిర్వహించాలి

సూర్యాపేటటౌన్ : గ్రూప్ -3 పరీక్షల కోసం పోలీస్ సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. గ్రూప్ 3 పరీక్షలను పురస్కరించుకుని విధుల నిర్వహణపై పోలీస్ అధికారులకు శనివారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఎస్పీ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది అప్రమత్తంగా పని చేయాలని ఆదేశించారు. ఎక్కడ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ , చిత్రంలో అధికారులు

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు



గ్రూప్- 3 పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్, ఇంటర్ నెట్ సెంటర్స్, చుట్టు పక్కల లౌడ్ స్పీకర్లు మూసి వేయాలి. పరీక్ష కేంద్రాల వద్ద నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుంపులుగా ఉండొద్దు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్‌లో పొందుపరిచిన విధంగా సమయానికి చేరుకోవాలి.

– సన్‌ప్రీత్ సింగ్, ఎస్పీ

క్లుప్తంగా

చెరువులో చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

మిర్యాలగూడ: చెరువులో చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ ఘటన మిర్యాలగూడ మండలం బొత్తలపాలెం గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బొత్తలపాలెం గ్రామానికి చెందిన జింకల తిరుపతయ్య(60) గ్రామ శివారులోని ఊర చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి నీటిలో పడిపోయాడు. తిరుపతయ్య ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి పరిశీలించగా ఒడ్డున చెప్పులు, కర్ర ఉండడం గమనించారు. గ్రామస్తుల సహాయంతో చెరువులో వెతికినప్పటికీ తిరుపతయ్య ఆచూకీ లభ్యం కాలేదు. వజీరాబాద్ మేజర్ కాలువ ఉధృతంగా వస్తుండడంతో గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సాగర్ నీటి విడుదలను నిలిపివేస్తున్నట్లు డీఈ జనార్దన్ తెలిపారు. తిరుపతయ్య భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

26 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యం బస్తాలు

శాలిగౌరారం: ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని శనివారం పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండలం మాధారంకలాన్ గ్రామానికి చెందిన జక్కుల చంటి తన ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు శనివారం అతడి ఇంట్లో సోదాలు చేసి 26 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి రిమాండ్

వలిగొండ: రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వలిగొండ మండలం రెడ్లరేపాక గ్రామానికి చెందిన పంతంగి రాజు రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి రవాణా చేస్తుండగా.. పోలీసులు కేసు నమోదు చేశారు. రాజును శనివారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధురాలు మృతి



కోటమ్మ (ఫైల్)

శాలిగౌరారం: ఇంటి ముందు చెట్టుకింద కూర్చొని సేద తీరుతున్న వృద్ధురాలిని ఓ వ్యక్తి మద్యం మత్తులో బైక్‌పై అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటన శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో జరిగింది. శనివారం ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. వల్లాల గ్రామానికి చెందిన కోయగూరి కోటమ్మ (70) శుక్రవారం సాయంత్రం శాలి గౌరారం–నకిరేకల్ రోడ్డు వెంట తన ఇంటి ముందు చెట్టుకింద కూర్చొని సేద తీరుతోంది. ఆ సమయంలో నకిరేకల్‌కు చెందిన వంటిపాక సాయి బైక్‌పై నకిరేకల్ నుంచి శాలిగౌరారం వెళ్తూ మద్యం మత్తులో అదుపుతప్పి చెట్టుకింద కూర్చున్న కోటమ్మను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కోటమ్మకు తీవ్రగాయాలు కాగా కుటుంబ సభ్యులు నల్లగొండలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందింది. మృతురాలి మనుమడు కోయగూరి సంపత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధుడి దారుణ హత్య



రోదిస్తున్న మృతుడి బంధువులు



పంచనామా చేస్తున్న పోలీసులు

- అకారణంగా కర్రతో కొట్టి చంపిన నిందితుడు
- రఘునాథపురంలో ఘటన

రాజాపేట: అకారణంగా వృద్ధుడిని ఓ వ్యక్తి కర్రతో కొట్టి హత్య చేశాడు. ఈ ఘటన రాజాపేట మండలం రఘునాథపురం గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపురం గ్రామానికి చెందిన మజ్జిక యాదగిరి (57)కి భార్య అంజమ్మ, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ఐదుగురి కుమార్తెల వివాహం జరిగింది. యాదగిరి రోజుమాదిరిగానే శనివారం ఉదయం సైకిల్‌పై గ్రామంలోని పెద్దమ్మ



యాదగిరి (ఫైల్)

గుడి వద్ద ఉన్న తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పశువులను కట్టేసి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన వడ్లకొండ నాగరాజు వెనుక నుంచి వచ్చి యాదగిరిపై కర్రతో విచక్షణారహితంగా దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. యాదగిరిపై నాగరాజు దాడి చేసి పారిపోవడాన్ని దూరం నుంచి గమనించిన కుందెనపల్లి నర్సింహులు వెంటనే గ్రామస్తులకు, యాదగిరి భార్యకు విషయం తెలియజేశాడు. వారు ఘటనా స్థలానికి వచ్చి చూసేసరికి యాదగిరి రక్తపు మడుగులో పడి ఉన్నాడు. కాగా నాగరాజు మూడు రోజుల క్రితం అతడి తల్లి పైన, గ్రామానికి చెందిన పల్లె నర్సింహులుపై దాడికి యత్నించగా.. వారు వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి కూడా గ్రామానికి చెందిన బత్తిని లక్ష్మణ్, జంపాల నవీన్ బైక్‌పై వస్తుండగా వారిపై నాగరాజు దాడికి యత్నించాడని గ్రామస్తులు తెలిపారు. నాగరాజు గతంలో పలు కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడని, అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని గ్రామస్తులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడు నాగరాజును అదుపులోకి తీసుకున్నారు.

గ్రామంలో ఉద్రిక్త వాతావరణం..

యాదగిరి హత్యతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నాగరాజు తరచూ గ్రామస్తులపై దాడికి పాల్పడుతున్నాడని ముందస్తు సమాచారం ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఎస్ఐని సస్పెండ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ నినాదాలు చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేసే వరకు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించవద్దని పట్టుబట్టారు. ఏసీపీ రమేష్, యాదగిరిగుట్ట టౌన్ సీఐ రమేష్, స్పెషల్ పోలీస్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. గ్రామస్తులకు సర్ది చెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. తన భర్తను నాగరాజు డబ్బులు అడిగి కొట్టి చంపి ఉంటాడని మృతుడి భార్య అంజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చీటీల పేరుతో మోసగించిన భార్యాభర్తల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నాగార్జునసాగర్: చీటీల పేరుతో మోసం చేసి పారిపోయేందుకు యత్నించిన భార్యాభర్తలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నాగార్జునసాగర్ సీఐ భీసన్న, ఎస్ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. నందికొండ మున్సిపాలిటీలోని పైలాన్ కాలనీలో గల తెలంగాణ జెన్‌కో కార్యాలయంలో ఆర్టిజన్‌గా పనిచేస్తున్న తురక శ్రీనివాసరావు, ఆయన భార్య లక్ష్మీపద్మావతి గత కొన్నేళ్లుగా చీటీల వ్యాపారం చేస్తున్నారు. జెన్‌కో ఉద్యోగులతో పాటు స్థానిక వ్యాపారులు, పలువురు ప్రైవేట్ ఉద్యోగులు వారి వద్ద నెలనెలా చీటీలు కట్టారు. గత రెండు మూడేళ్లుగా చీటీలు ఎత్తిన వారికి శ్రీనివాసరావు, అతడి భార్య నగదు ఇవ్వకుండా ప్రామిసరీ నోట్లు రాసిస్తూ, త్వరలో ఇస్తామంటూ నమ్మిస్తూ వచ్చారు. ఇటీవల కోర్టుకు వెళ్లి ఐపీ పెట్టి చీటీలు వేసిన వారికి నోటీసులు పంపారు. కొందరు జెన్‌కో ఉద్యోగులు చీటీ డబ్బులు అడిగేందుకు శ్రీనివాసరావు ఇంటికి వెళ్లగా.. వారిపై పెంపుడు కుక్కలను వదలడంతో భయాందోళనకు గురై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జెన్‌కో ఎస్ఈ రఘురాం స్థానిక విజయపురిటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 11వ తేదీన ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం శ్రీనివాసరావు, అతడి భార్య లక్ష్మీపద్మావతి కారులో ఆంధ్రాకు పారిపోతుండగా బార్డర్ చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ సంపత్‌తో పాటు పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లక్ష్మీపద్మావతి తమ్ముడు మహ్మద్ షరీఫ్ సహకారంతో చీటీల పేరుతో 40 మందిని మోసగించి సొమ్ము చేసుకున్నట్లు విచారణలో వారు ఒప్పుకున్నారు. ఆ సొమ్ముతో బంగారం, కారు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. వారి నుంచి కారు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, బ్యాంక్ పాసుపుస్తకాలు రికవరీ చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసును ఛేదించిన ఎస్ఐ ఎస్. సంపత్, హెడ్‌కానిస్టేబుళ్లు శంకర్‌బాబు, గురునాథం, కానిస్టేబుల్ రామకోటి, జావీద్, హోంగార్డు సతీష్, విజయ్, ఇతర సిబ్బందిని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, సీఐ భీసన్న అభినందించారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్.. ఇద్దరికి గాయాలు

ఆత్మకూర్(ఎస్): బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండలం కోటినాయక్‌తండా సమీపంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండల కేంద్రానికి చెందిన పిట్టల అంజయ్య, బయ్య ముత్యాలు సూర్యాపేట నుంచి బైక్‌పై నూతనకల్‌కు వెళ్తుండగా.. ఆత్మకూర్(ఎస్) మండలం కోటినాయక్‌తండా సమీపంలోని ఎస్సారెస్పీ కాలువ వద్దకు రాగానే సూర్యాపేట–దంతాలపల్లి రహదారి నుంచి దుబ్బతండాకు వెళ్తున్న టిప్పర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంజయ్య, ముత్యాలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో వారిద్దరిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. బయ్య ముత్యాలు తల్లి అంజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరు మృతి

- మరో ఇద్దరికి గాయాలు



వలీపాష (ఫైల్)

అర్వపల్లి: సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లి గ్రామ స్టేజీ వద్ద శుక్రవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందగా.. మరో ఇద్దరికి గాయాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామానికి చెందిన షేక్ వలీపాష టెంట్‌హౌస్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఆయన బైక్‌పై జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్‌లో ఉంటున్న తన అత్తగారి ఇంటికి వస్తున్నాడు. అదే సమయంలో పర్సాయపల్లి గ్రామానికి చెందిన జంపాల సైదులు, తన భార్య శైలజతో కలిసి బైక్‌పై అడివెంల గ్రామం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ రెండు బైక్‌లు పర్సాయపల్లి గ్రామ స్టేజీ వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వలీపాష, సైదులు, శైలజకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. వలీపాష పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య హమీదాబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్. బాలకృష్ణ తెలిపారు.

బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

త్రిపురారం: వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన నిడమనూరు మండలం బంకాపురం గ్రామంలో శనివారం జరిగింది. నిడమనూరు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం .. బంకాపురం గ్రామానికి చెందిన ఎలకుర్తి గోపాల్‌రావు వ్యవసాయ బావిలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడు నీలం రంగు టీషర్టు ధరించి ఉన్నాడని, మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, అతడు బావిలో పడి మూడు, నాలుగు రోజులై ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. బంకాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి శోభారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరి పరిస్థితి విషమం

చివ్వెంల(సూర్యాపేట): ముందు వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక స్కూటర్‌పై వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొని మృతిచెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చివ్వెంల మండలం బీబీగూడెం గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం కాసరాబాద్ గ్రామానికి చెందిన ఒగ్గు లచ్చిబాబు(30) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. లచ్చిబాబు శనివారం రాత్రి తన స్నేహితుడితో కలిసి స్కూటర్‌పై చివ్వెంల మండల కేంద్రానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో బీబీగూడెం గ్రామ శివారులో సూర్యాపేట వైపు ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి స్కూటర్‌తో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో లచ్చిబాబు అక్కడికక్కడే మృతి చెందగా, అతడి స్నేహితుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలంలో ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్ఐ వి. మహేశ్వర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ మధు

గుర్రంపోడు: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గుర్రంపోడు మండలం కొండాపురం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. శనివారం ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలం తేనెపల్లి గ్రామానికి చెందిన బొడ్డుపల్లి కృష్ణయ్య(40)కు మతిస్థిమితం సరిగ్గా లేదు. అతడికి వివాహం కాలేదు. కృష్ణయ్య తన అన్న బుచ్చయ్య వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. కృష్ణయ్య శుక్రవారం అర్ధరాత్రి కొండాపురం గ్రామంలో రోడ్డుపై తిరుగుతుండగా గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న బొడ్డుపల్లి బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎస్‌బీహెచ్ రిటైర్డ్ ఉద్యోగులు

నల్లగొండ టౌన్: ఎస్‌బీహెచ్ రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ అప్‌డేటేషన్ సమస్యలను పరిష్కరించాలని లీడ్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ పీజే జేమ్స్ అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని చిన వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఎస్‌బీహెచ్ నల్లగొండ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని బాగోగులు తెలుసుకున్నారు. 82 సంవత్సరాల సీనియర్ రిటైర్డ్ ఉద్యోగి పి. ముత్యాలును సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీజీఎంలు, మాజీ అధికారులు, రిటైర్డ్ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నృసింహుడి సన్నిధిలో ఏపీ హైకోర్టు జడ్జి



జస్టిస్ రవినాథ్ తిల్హరీకి, కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ రవినాథ్ తిల్హరీ శనివారం రాత్రి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఘనంగా స్వాగతం పలికారు. వేద ఆశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదం అందజేశారు.

ఒక్కో చోట ఒక్కో విధంగా!

గందరగోళంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు

- మూడేళ్ల సర్వీస్, ఎపిక్ కార్డు ప్రామాణికం
- కొన్ని మండలాల్లో ఓటరు కార్డు లేకున్నా నమోదు
- ఆధార్‌కార్డు ఆధారంగా దరఖాస్తుల ఆమోదం
- నిబంధనలు ఖాతరు చేయని అధికారులు



సాక్షి యాదాద్రి : వరంగల్ – నల్లగొండ – ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్వీస్, ఎపిక్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవాలన్న నిబంధనలు ఉన్నప్పటికీ ఎంతఃఓలు అవేమీ పట్టించుకోలేదని, తాము అనుకున్న వారికి మేలు జరిగేలా వ్యవహరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల ఎపిక్, ఆధార్‌కార్డు రెండూ లేకున్నా ఓటరుగా ఆమోదించినట్లు తెలుస్తోంది.

1,743 మంది దరఖాస్తు

2025 మార్చిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఎన్నికల కమిషన్ నిబంధనలు అనుసరించి అక్టోబర్ 30న నోటిఫికేషన్ వెలువడింది. ఓటరు నమోదుకు కల్పించిన అవకాశం ఈనెల 6తో ముగిసింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని 17 మండలాల పరిధిలో 1,743 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కుకోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 1,736 దరఖాస్తులను అధికారులు పరిశీలించి 834 దరఖాస్తులను అమోదించారు. వివిధ కారణాలతో 902 దరఖాస్తులను తిరస్కరించారు.

ఆమోదం పొందిన దరఖాస్తులు ఇలా..

బొమ్మలరామారం మండలంలో 71 దరఖాస్తులు రాగా కేవలం ఆరుగురు ఉపాధ్యాయుల దరఖాస్తులే ఆమోదం పొందాయి. 65 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. బీబీనగర్ మండలంలో 86 శాతం, భువనగిరి మండలంలో 60 శాతం, తుర్కపల్లి మండలంలో 56 శాతం, గుండాల మండలంలో 47 శాతం, యాదగిరిగుట్ట మండలంలో 12 శాతం, ఆత్మకూర్(ఎం) మండలంలో 22 శాతం, రాజాపేట మండలంలో 24 శాతం, మోటకొండూర్ 32 శాతం దరఖాస్తులు ఆమోదం పొందాయి.

ఉల్లంఘన!

జిల్లాలో ఓటరు నమోదుకోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులందరికీ ఒకే నిబంధన పాటించాల్సి ఉంది. కానీ, ఒక్కో చోట ఒక్కో విధంగా జరిగింది. కొంతమంది ఉపాధ్యాయులకు మేలు జరిగే విధంగా అధికారులు నిర్ణయాలు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఒకే మండలంలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులకు వేర్వేరు చోట్ల ఆధార్ కార్డు ఉంది. ఒకరికి భువనగిరిలో, ఇంకొకరికి యాదగిరిగుట్ట మండలంలో ఆధార్ కార్డులు ఉన్నాయి. ఆధార్ కార్డు ఉన్నందున, ఓటర్ గుర్తింపు కార్డు లేకున్నా వారిని ఓటరుగా ఆమోదించారు. భువనగిరిలో పనిచేస్తున్న ఉపాధ్యాయునికి ఆధార్ కార్డు ఉన్నా ఓటరు గుర్తింపు కార్డు లేదని అతని దరఖాస్తును తిరస్కరించారు. మెజార్టీ మండలాల్లో ఓటరు గుర్తింపు కార్డు ఉంటేనే ఆమోదించారు. ఇక రాజాపేట, యాదగిరిగుట్ట, మోటకొండూర్, ఆలేరు, మోత్కూర్, ఆత్మకూర్(ఎం) మండలాల్లో ఓటరు, ఆధార్ కార్డు రెండు లేకున్నా దరఖాస్తులను ఆమోదించినట్లు తెలుస్తోంది.

అధికారుల తీరుపై విమర్శలు

ఉపాధ్యాయుల ఓటరు నమోదుపై అధికారులు తమ ఇష్టానుసారంగా తీసుకున్న నిర్ణయాలను పలు ఉపాధ్యాయ సంఘాలు తప్పు పడుతున్నాయి. దరఖాస్తులను పునఃపరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హులకే ఓటు హక్కు కల్పించాలని కోరుతున్నాయి.

విచారణ చేస్తాం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదుపై ఫిర్యాదులు అందాయి. పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు తమ దృష్టికి తీసుకువచ్చారు. ఆమోదం పొందిన, తిరస్కరించిన దరఖాస్తులను పరిశీలిస్తాం. ఇందుకోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ నిర్ణయించారు. అర్హతలున్నప్పటికీ దరఖాస్తు తిరస్కరణకు గురైన వారుంటే తమకు తెలియజేయాలి. నిబంధనల ప్రకారం అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తాం.

–కృష్ణారెడ్డి, ఆర్డీఓ

నిబంధనలు ఇవీ..

ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు 2024 సంవత్సరానికి ముందు గడిచిన ఆరేళ్లలో మూడేళ్లు ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో విధులు నిర్వహించి ఉండాలి. ఉద్యోగం చేస్తున్న ప్రాంతంలో ఓటు వేయడానికి అవకాశం లేదని, నివాస ధ్రువీకరణ కోసం ఎపిక్ కార్డును ప్రామాణికంగా నిర్ణయించారు. అయితే కొన్ని మండలాల్లో అధికారులు ఎపిక్ కార్డు ఉన్న ఉపాధ్యాయులనే ఓటరుగా ఆమోదించారు. మరికొన్ని చోట్ల ఎపిక్ కార్డు లేకున్నా ఆధార్ కార్డు ప్రామాణికంగా ఆమోదించారు. కొందరు అధికారులు ఓటరు, ఆధార్ కార్డు లేకున్నా తమ అనుకున్న వారికి అనుకూలంగా వ్యవహరించారన్న విమర్శలున్నాయి.

గంజాయి కట్టడికి చర్యలు తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, చిత్రంలో డీసీపీ రాజేష్‌చంద్ర, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు తదితరులు

- యాదాద్రి కలెక్టర్ హనుమంతరావు

సాక్షి,యాదాద్రి : గంజాయి కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని, అందుకోసం గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించే కేంద్రాలపై దృష్టి సారించాలన్నారు. హైరిస్క్ ప్రాంతాల్లో నిఘాపెంచి కేసులు నమోదు చేయాలని సూచించారు. అవసరమైన చోట చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేయాలని పేర్కొన్నారు. విక్రయదారులను గుర్తిస్తే సులభంగా నియంత్రణ చేయవచ్చన్నారు. విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు తెలియజేయాలన్నారు. డీసీపీ రాజేష్‌చంద్ర మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి కట్టడికి నిఘా పెంచాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గంగాధర్, వీరారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, డీపీఓ సునంద, ఎక్సైజ్ సీఐలు పాల్గొన్నారు.